
అన్నదాతకు భరోసా ఏదీ?

రైతుల సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం

- ఆరు నెలలు గడిచినా అన్నదాత సుఖీభవ ఊసేలేదు
- ఉచిత పంటల బీమాకు మంగళం
- అప్పులు చేసి రబీ సాగు



కావలి మండలం కొత్తపల్లిలో తాళం వేసి ఉన్న రైతుసేవా కేంద్రం



కావలి: కూటమి ప్రభుత్వం అన్నదాతల సంక్షేమాన్ని విస్మరించింది. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా అన్నదాత సుఖీభవ పథకం అమలు ఊసే ఎత్తడం లేదు. ఉచిత పంటల బీమాకు మంగళం పాడింది. దీంతో చిన్న,సన్నకారు రైతులు అప్పులు చేసి రబీ సాగు చేపట్టాల్సిన పరిస్థితి నెలకొంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసింది. క్రమం తప్పకుండా ఏటా రైతులకు రైతుభరోసా పథకం కింద పెట్టుబడి సాయాన్ని అందజేసింది. రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అన్ని రకాలను సేవలను ఇంటి ముంగిటకే అందించింది. ఉచిత పంటల బీమాను అమలు చేసింది. ప్రకృతి విపత్తులతో నష్టపోయిన రైతులకు పరిహారం అందించింది. పండించిన పంటలను కొనుగోలు చేసి మద్దతు ధరలను సైతం అందజేసింది. తద్వారా గత ఐదేళ్లలో వ్యవసాయాన్ని పండగలా మార్చింది. దీంతో గతంతో పోలిస్తే సాగు విస్తీర్ణం కూడా 20 శాతానికి పైగా పెరిగింది.

ఆర్బీకే వ్యవస్థ ద్వారా ..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అన్ని రకాల సేవలను ఇంటి ముంగిటే అందించే లక్ష్యంతో రైతుభరోసా కేంద్రాలను తీసుకొచ్చింది. అందులో భాగంగా కావలి నియోజకవర్గంలోని కావలి, అల్లూరు, బోగోలు, దగదర్తి మండలాల్లో 63 ఆర్బీకేలను ఏర్పాటు చేసింది. అందులో 30 ఆర్బీకేలకు సొంత భవనాలు ఉండగా, మిగిలిన 33 ఆర్బీకేలను అద్దె భవనాల్లో ఏర్పాటు చేసింది. ఒక్కో ఆర్బీకే నిర్మాణానికి రూ.23.94 లక్షల వంతున ఖర్చు చేసింది. రైతులకు సేవలు అందించేందుకు ఆర్బీకేల్లో 44 మంది సిబ్బందిని నియమించింది. ఆర్బీకేల ద్వారా ఏటా రబీ సీజన్‌లో 5వేలు, ఖరీఫ్ సీజన్‌లో 2వేల క్వింటాళ్లకుపైగా నాణ్యమైన విత్తనాలను రైతులకు ప్రభుత్వం రాయితీపై అందజేసింది. అకాల వర్షాలతో నారుమళ్లు దెబ్బతిన్న రైతులకు 80 శాతం సబ్సిడీపై మళ్లీ విత్తనాలను సైతం పంపిణీ చేసింది. ఏటా సుమారు రెండు వేల టన్నులకుపైగా ఎరువులను ఇంటిముంగిటకే అందజేసింది. పంట నూర్పిళ్ల సమయంలో ఏటా 1.50 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు కనీస మద్దతు ధరను అందించింది. ధాన్యం విక్రయించుకునేందుకు రైతులు ఇబ్బందులు పడకుండా ఆర్బీకే సిబ్బంది ముందస్తుగా ఈ–క్రాప్ ద్వారా వివరాలు నమోదు చేసేవారు. ఏటా సుమారు 15వేల మంది రైతుల వివరాలను ఈ–క్రాప్‌లో నమోదు చేయడం ద్వారా మెరుగైన సేవలు అందించింది. ఆర్బీకేల ద్వారా రైతుభరోసా, పీఎం కిసాన్, పొలంబడి, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ, పంటల బీమా, తదితర సుమారు 20 రకాల సేవలు అందేవి. భూసార పరీక్షలు సైతం నిర్వహించి శాస్త్రీయ పద్ధతిలో నేల స్వభావాన్ని, సూక్ష్మ, స్థూల పోషకాలను అంచనా వేసి రైతులకు ఏ మేర ఎరువులు వేయాలి, ఏఏ పంటలు సాగుచేయాలి వంటి సూచనలు, సలహాలను సైతం అందజేసింది. తద్వారా రైతుల పెట్టుబడులు గణనీయంగా ఆదా అయ్యాయి. ఆర్బీకేల ద్వారా పంటల బీమా కూడా రైతులకు సులభంగా అందుబాటులోకి వచ్చింది. ఆర్బీకేల్లో ఉన్న రైతుల వివరాల ఆధారంగా సిబ్బంది ఉచిత పంటల బీమా చేయించడంతో పాటు ప్రకృతి విపత్తుల కారణంగా నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం సైతం అందేది. ఆర్బీకేలను రైతు సేవా కేంద్రాలుగా మార్చిన కూటమి ప్రభుత్వం అరకొర సేవలను రైతులకు అందిస్తోంది. ఆర్బీకేల ద్వారా ఎరువుల పంపిణీని నిలిపివేసింది. విత్తనాలను అరకొరగా పంపిణీ చేస్తోంది. ఉచిత పంటల బీమాను సైతం నిలిపివేసింది.

సుఖీభవ కోసం నిరీక్షణ

కూటమి ప్రభుత్వం రబీ సీజన్‌లోనైనా అన్నదాత సుఖీవ పథకం కింద నగదు సాయం అందజేస్తుందని రైతులు ఆశించారు. అయితే ఆ ఊసే ఎత్తకపోవడంతో చిన్న, సన్నకారు రైతులు అప్పులు చేసి మరీ వరినాట్లు వేసుకుంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుభరోసా పథకం కింద ఏటా అర్హులైన రైతులకు రూ.13,500 చొప్పున నగదు సాయం అందజేసి ఆదుకుంది. గత ఐదేళ్లలో కావలి నియోజకవర్గంలో 35వేల మంది రైతులకు రూ.225 కోట్ల మేర పెట్టుబడి సాయం అందింది.అయితే ఎన్నికల హామీల్లో భాగంగా కూటమి నాయకులు అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20 వేలు సాయం అందజేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా ఇప్పటి వరకు అమలు చేయకపోవడంతో రైతులకు ఎదురుచూపులే మిగిలాయి. ఖరీఫ్ సీజన్‌లో అందజేస్తారని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. ప్రస్తుత రబీ సీజన్‌లోనూ ప్రభుత్వం ఆ ఊసెత్తకపోవడంతో రైతులు బ్యాంకులు, బయట అప్పులు చేసి సాగు చేపట్టాల్సిన పరిస్థితి నెలకొంది.

రైతులను ఆదుకోవాలి



ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే రైతులకు ఎంతో మేలు చేస్తామని కూటమి నేతలు ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చి ఆరునెలలు గడిచినా అన్నదాతల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదు. రబీ మొదలైనా అన్నదాత సుఖీభవ పథకం కింద అందజేస్తామన్న రూ.20వేలు నగదు సాయం ఊసే ఎత్తడం లేదు. గతంలో పంటల బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుండగా, ఇప్పుడు రైతులే చెల్లించాల్సి వస్తోంది. ఇప్పటికై నా ప్రభుత్వం నగదు సాయం అందించి రైతులను ఆదుకోవాలి.

–సుధీర్ రెడ్డి, రైతు, అల్లూరు

రైతులను దగా చేయడం తగదు



ఎన్నికల సమయంలో అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20వేలు సాయాన్ని అందజేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఆ ఊసెత్తకపోవడం రైతులను దగా చేయడమే. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతుభరోసా పథకం కింద ఏటా పెట్టుబడి సాయాన్ని అందజేసింది. ఆ ఐదేళ్లు రైతులు ఎంతో సంతోషంగా సాగు చేపట్టారు. ఇప్పుడు ప్రభుత్వ సాయం అందక సన్నకారు రైతులు రబీ సాగుకు పెట్టుబడుల కోసం ఇబ్బందులు పడుతున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలి.

–సుబ్బారావు, సన్నకారు రైతు, అల్లూరు

సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

అనుమసముద్రంపేట: మండలంలోని 14 సాగునీటి సంఘాలకు ఈ నెల 14న జరగనున్న ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇరిగేషన్ ఏఈ యాసిన్ తెలిపారు. గురువారం ఆయన ఏఎస్ పేటలోని ఇరిగేషన్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మండలంలోని 14 సాగునీటి సంఘాలకు సంబంధించి 2007 మంది పురుష, 774 మంది మహిళా ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వద్ద బ్రిడ్జిల నిర్మాణం

కావలి: కావలి నియోజకవర్గంలోని రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వద్ద బ్రిడ్జిలను నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం బిట్రగుంట స్టేషన్ తనిఖీకి వచ్చిన విజయవాడ రైల్వేడివిజనల్ ఏడీఆర్‌ఎం కేడీఎస్ కృష్ణతో కలిసి రైల్వే లెవల్‌క్రాసింగ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కావలిలోని పెద్దపవని రోడ్డులో రైల్వే అండర్ పాస్, కచేరిమిట్ట ఫైర్‌స్టేషన్ రోడ్డులో రైల్ ఓవర్ బ్రిడ్జి నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బోగోలులో రైలు ఓవర్ బ్రిడ్జి, మిగిలిన చోట్ల అండర్ పాస్‌లను నిర్మించడానికి రైల్వే అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేశారని వివరించారు.

15 మద్యం సీసాలు స్వాధీనం

జలదంకి: మండలంలోని హనుమకొండపాళెంలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్నారనే సమాచారంతో కావలి ఎక్సైజ్ సిబ్బంది గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో జానా మురళి వద్ద 15 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు కావలి ఎక్సైజ్ సీఐ సుంకర శ్రీనివాసులు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై ఎం దేవిక, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిబ్రవరి 2న ఆపస్ టాలెంట్ టెస్ట్

వింజమూరు: ఉదయగిరి నియోజకవర్గ స్థాయిలో ఏటా జరిపే ఆపస్ టాలెంట్ టెస్ట్‌ను ఫిబ్రవరి 2న నిర్వహించనున్నట్లు ఆపస్ నేతలు కందుల మధు, వెంగయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వింజమూరులోని వైఆర్ జూనియర్ కళాశాలలో పరీక్ష జరుగుతుందని చెప్పారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చేజర్లలో చిరుజల్లులు

చేజర్ల: మండలంలో గురువారం చిరుజల్లులు కురిశాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆకాశం మేఘావృతమై ఉదయం నుంచి చిరుజల్లులు పడ్డాయి. మరో రెండ్రోజులు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో వరి నారుమళ్లు, నాట్లు దెబ్బతింటాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

విద్యావనరుల కేంద్రంలో ఆధార్ క్యాంపు

వరికుంటపాడు: మండల విద్యావనరుల కేంద్రంలో ఈ నెల 31వ తేదీ వరకు ఆధార్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు మస్తాన్‌వలి, రమణయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల్లోని విద్యార్థుల వివరాలు, ఆధార్‌లోని వివరాలు సరిపోలక అపార్ నమోదులో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా ఆధార్ క్యాంపును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆధార్‌లో మార్పులు, చేర్పులు చేయించుకోవాలని సూచించారు. ఆధార్ సేవలపై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని కోరారు.

'రైతులకు అండగా' జయప్రదానికి పిలుపు

ఉదయగిరి: కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నెల్లూరులో శుక్రవారం చేపడుతున్న ఆందోళనను జయప్రదం చేయాలి ఆ పార్టీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలు, రైతులు తరలి రావాలి కోరారు.

మాలల మహాగర్జన జయప్రదానికి పిలుపు



అల్లూరు: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 15న గుంటూరులో మాలల మహాగర్జన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్రాధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు తెలిపారు. అల్లూరులోని అంబేడ్కర్ యువజన సంఘ కార్యాలయంలో మాలల మహాగర్జన పోస్టర్లను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మాలలు పెద్ద ఎత్తున పాల్గొని మహాగర్జనను విజయవంతం చేయాలని కోరారు. సంఘ నాయకులు దానం మాల్యాద్రి, గాలి వేణుగోపాల్, గంగపట్నం సతీష్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

'మా ఓట్లను ఎందుకు తొలగించారు'

– డీటీని నిలదీసిన జమ్మవరం రైతులు

అనుమసముద్రంపేట: ఈనెల 14వ తేదీన సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఓట్ల తొలగింపు విషయమై జమ్మవరం రైతులు గురువారం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని డిప్యూటీ తహసీల్దార్‌ను నిలదీశారు. రైతుల తెలిపిన వివరాల మేరకు..గత అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారనే నెపంతో టీడీపీ నేతలు జమ్మవరానికి చెందిన దాదాపు 22 మంది రైతుల ఓట్లను సాగునీటి సంఘం ఎన్నికల జాబితా నుంచి తొలగించారు. దీంతో రైతులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ నెల 11న హైకోర్టు రైతులకు అనుకూలంగా తీర్పునిస్తూ ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేయాలని అటు తహసీల్దార్, ఇటు ఇరిగేషన్ శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో రైతులు డిప్యూటీ తహసీల్దార్‌ను గురువారం సంప్రదించారు. అయితే ఇప్పటికిప్పుడు ఓట్లు నమోదు చేసేందుకు అవకాశం లేదని, విజయవాడకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని రైతులకు తెలపడంతో వారు అవాక్కయ్యారు తాము నీటి సంఘాల ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోకుండా టీడీపీ నాయకులు ఇబ్బందులు పెడుతున్నారని రైతులు వాపోయారు. . మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు అధికారులు ఓట్లు నమోదు చేయడం లేదని వారు ఆరోపించారు. జిల్లా అధికారులు స్పందించి ఓటు హక్కు కల్పించాలని వేడుకున్నారు. రైతులు శ్రీహరి, కృష్ణమూర్తినాయుడు, రమ్య, వేమూరు సులోచన, వేమూరు సుబ్బమ్మ, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

కాలువలు ఇలా.. సాగునీరు పారేదెలా?

- గండిపాళెంలో 21 అడుగుల నీటిమట్టం
- తుంగ, కంపచెట్లతో నిండిన కుడి, ఎడమ కాలువలు
- పూడిపోయిన బ్రాంచ్ కెనాల్స్
- ప్రశ్నార్థకంగా ఆయకట్టు సాగు

కుడికాలువలో దట్టంగా పెరిగిన తుంగ



ఉదయగిరి: అసలే కరువు ప్రాంతం..వర్షాలు పడి ప్రాజెక్ట్‌ల్లోకి సాగునీరు వస్తే అన్నదాతల ఆనందం వర్ణనాతీతం. ఉదయగిరి మెట్టప్రాంత రైతుల వరప్రసాదిని గండిపాళెం ప్రాజెక్ట్. ఇటీవల కురిసిన వర్షాలకు మూడేళ్ల తరువాత ప్రాజెక్ట్‌లోకి ఆశాజనకంగా నీరు చేరింది. ప్రస్తుతం 21 అడుగుల మేర నీటిమట్టం ఉంది. ఇంకా వర్షాలు కురిస్తే ప్రాజెక్ట్ నిండే అవకాశం ఉంది. అయితే ప్రాజెక్ట్ తూముల నుంచి లీకేజీ రూపంలో సాగునీరు వృథాగా పోతోంది. కుడి, ఎడమ కాలువలు తుంగ, కంపచెట్లతో నిండి సాగునీరు ముందుకు సాగే పరిస్థితి కనిపించడం లేదు. డిస్ట్రిబ్యూటరీ కాలువలు సైతం పూడిపోయి ఉన్నాయి. ఫలితంగా ఆయకట్టుకు సాగునీటి చేరిక ప్రశ్నార్థకంగా మారడంతో అన్నదాతల ముఖాల్లో ఆనందం కనిపించడం లేదు.

వరికుంటపాడు రైతులకే ప్రయోజనం

ఉదయగిరి మండలం గండిపాళెంలో ప్రాజెక్ట్ ఉన్నా ప్రధానంగా లబ్ధి పొందేది మాత్రం వరికుంటపాడు మండలానికి చెందిన రైతులు. ఎడమ కాలువ కింద ఉదయగిరి మండలం గండిపాళెం గ్రామం ఒక్కటే ఉంది. మిగిలిన యర్రంరెడ్డిపల్లి, ఇసుకపల్లి, మహ్మదాపురం, కొండాయపాళెం, గొల్లపల్లి, కాంచెరువు, గువ్వాడి గ్రామాలు అన్ని వరికుంటపాడు మండలంలో ఉన్నాయి. ప్రాజెక్టు ఒక్కసారి నిండితే దాదాపు రెండేళ్ల పాటు పంటలకు ఢోకా ఉండదు. మూడేళ్ల తర్వాత ఆ స్థాయి నీరు ఇప్పుడు మాత్రమే చేరింది. కుడి కాలువ కింద వరికుంటపాడు మండలం జీ కొండారెడ్డిపల్లి, ఉదయగిరి మండలం గుడినరవ, తిరుమలపురం గ్రామాలు ఉన్నాయి.


నిధులు కేటాయింపులు ఏవీ?

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతుల సమస్యలను పూర్తిగా పట్టించుకోవడం లేదు. కేవలం తమ పార్టీ కార్యకర్తలకు ప్రయోజనం చేకూర్చే మట్టి, ఇసుక, మద్యం, సిమెంట్‌రోడ్లపైనే దృష్టి పెట్టింది. సాగునీటి వనరులను పూర్తిగా గాలికి వదిలేసింది. ఉదయగిరి నియోజవర్గంలోని ప్రధాన సాగునీటి వనరులైన గండిపాళెం ప్రాజెక్ట్, నక్కలగండి జలాశయాలకు నిధులు కేటాయింపులు చేయలేదు. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు ప్రాజెక్ట్‌ల్లో నీరు చేరినా కాలువలు అధ్వానంగా ఉండడంతో సాగునీటిని విడుదల చేయలేని దుస్థితి నెలకొంది.

ప్రాజెక్ట్ పేరు	గండిపాళెం
ఆయకట్టు విస్తీర్ణం	16వేల ఎకరాలు
నీటి సామర్థ్యం	35 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	21 అడుగులు
అంచనా ప్రతిపాదనలు	రూ.58 లక్షలు
మంజూరు చేసింది	నిల్



ఎడమ కాలువలో పెరిగిన కంపచెట్లు



జలకళతో గండిపాళెం జలాశయం



గేట్ల నుంచి లీకవుతున్న నీరు

ప్రతిపాదనలు పంపాం



గండిపాళెం జలాశయం పరిధిలోని కాలువల మరమ్మతులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. త్వరలో నిధులు వచ్చే అవకాశం ఉంది. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. తూముల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి.త్వరలో పనులు చేపడతాం.

–చంద్రమౌళి, డీఈ, ఇరిగేషన్, ఉదయగిరి

క్లుప్తంగా

అభివృద్ధి ప్రణాళికల తయారీపై శిక్షణ



వరికుంటపాడు: మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీపై అధికారులు, సర్పంచ్‌లకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ పంచాయతీలను ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలి, ప్రజల అవసరాలు ..వాటిని ఎలా పరిష్కరించాలి, జీవనోపాధుల మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈఓపీఆర్డీ నాగూర్‌వలి, ఎంఈఓ రమణయ్య, ఏఓ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి



అల్లూరు: మండలంలోని నార్త్‌మోపూరు, అల్లూరులోని లేఅవుట్లలో గృహ నిర్మాణాలను జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ వేణుగోపాల్ గురువారం పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న గృహాల లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణాలను పూర్తి చేయించాలని గృహ నిర్మాణ శాఖ ఏఈ వెంకటేశ్వర్లుకు సూచించారు. మార్చిలోగా గృహాలను పూర్తిచేయకపోతే బిల్లులు వెనుకకు వెళ్లిపోతాయన్నారు. నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు మాధవ్, సౌక్య, సురేష్ ఉన్నారు.

పరామర్శ



కావలి: పట్టణంలోని బండ్లవారివీధిలో గురువారం జరిగిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గుర్రం వెంకటేశ్వర్లు అత్త అరుణమ్మ ఉత్తరక్రియల్లో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. అరుణమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జీవీ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వరికుంటపాడు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి ఆయేషా సూచించారు. తిమ్మారెడ్డిపల్లిలోని గ్రామ సచివాలయం వద్ద గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. 57మంది రోగులకు వైద్యాధికారిణి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

ఆర్థిక సాయం



ఆత్మకూరు: పట్టణంలోని చావడి సెంటర్‌కు చెందిన షేక్ షానవాజ్ తీవ్ర అనారోగ్యంతో మంచానికే పరిమితమైన నేపథ్యంలో సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి రూ.10వేలు నగదు సాయాన్ని గురువారం అందజేశారు. షానవాజ్ ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని మూడు నెలల పాటు ఆర్థిక సాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ప్రసాద్‌రెడ్డి, సాధిక్‌హుస్సేన్, తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు క్రీడా పోటీలు

కావలి: పట్టణంలో దివ్యాంగులకు క్రీడా పోటీలను గురువారం నిర్వహించారు. కావలి రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్సై సీహెచ్ తిరుమల రెడ్డి క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. అనంతరం మోటార్ సైకిల్ రేస్, సైకిల్ రేస్, స్లో వాకింగ్, రన్నింగ్, సూదిలో దారం, మ్యూజికల్ చైర్స్ తదితర పోటీలను నిర్వహించగా దివ్యాంగులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి మోసం

కావలి: ఓ వ్యక్తి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.5లక్షలు కాజేయడంతో బాధితుడు కావలి రూరల్ పోలీసులను ఆశ్రయించాడు. వివరాలు.. బాపట్ల జిల్లా అద్దంకి మండలం మోదేపల్లికి చెందిన భీమినేని హరికృష్ణ డిగ్రీ వరకు చదివాడు. 2023లో ఉద్యోగం కోసం అన్వేషిస్తుండగా ముసునూరుకు చెందిన నిమ్మకాయల మదన్‌కుమార్ పరిచయమయ్యాడు. ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.5 లక్షలు నగదు తీసుకుని మోహం చాటేశాడు. వ్యవసాయ పనులు చేసుకునే తన తల్లిదండ్రుల కష్టార్జితమని, నగదు తిరిగి ఇవ్వాలని పలుమార్లు కోరినా మదన్‌కుమార్ ఇవ్వకపోవడంతో హరికృష్ణ కావలి రూరల్ పోలీసులను ఆశ్రయించాడు. కావలి రూరల్ సీఐ జీ రాజేశ్వరరావు ఆదేశాల మేరకు ఎస్సై సీహెచ్ తిరుమలరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మర్రిపాడులో రెవెన్యూ సదస్సు

మర్రిపాడు: మర్రిపాడు సచివాలయంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్‌కుమార్ గురువారం తెలిపారు. అల్లంపాడు రెవెన్యూ పరిధిలోని రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు

వరికుంటపాడు: రెవెన్యూ సదస్సుల ద్వారా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ పీ హేమంత్‌కుమార్ తెలిపారు. మండలంలోని తోటల చెరువుపల్లె, గొల్లపల్లి గ్రామాల్లో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన మాట్లాడారు. భూముల సర్వే, హద్దుల ఏర్పాటు, పట్టాదారు పాస్ పుస్తకాలు, పొలాల్లోకి వెళ్లే రహదారులు, అడంగల్‌లో పేర్ల మార్పు, తదితర సమస్యలను రైతులు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. కాగా భూ సమస్యలపై రైతుల నుంచి ఏడు అర్జీలు అందినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ యశ్వంత్‌కుమార్, సర్వేయర్ విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి ద్వారా పశుగ్రాస క్షేత్రాల సాగు



మాట్లాడుతున్న ఏడీ గురుజయంతి

మర్రిపాడు: ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద పశుగ్రాసం క్షేత్రాల సాగుకు అవకాశం కల్పించిందని పశు సంవర్ధక శాఖ ఏడీ ఎస్ గురుజయంతి తెలిపారు. మర్రిపాడులోని పశువైద్యశాలలో గురువారం ఆమె మీడియా సమావేశం నిర్వహించారు. మండలంలో 38 ఎకరాల్లో పశుగ్రాసం సాగుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తెలిపారు. ఆసక్తి కలిగిన పాడి రైతులు ఉపాధి జాబ్ కార్డు, పొలం పత్రాలు, ఆధార్, బ్యాంకు పాస్‌బుక్‌తో మర్రిపాడులోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఆమె వెంట పశువైద్య సిబ్బంది ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురవడంతో ఇక్కట్లు



ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకెళ్లడంతో ఖాళీగా దర్శనమిస్తున్న దిమ్మె

జలదంకి: మండలంలోని చామదలలోని వడ్డెర వీధిలోని ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురవడంతో తాగు, సాగునీటికి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో రెండు మంచి నీటి పథకం మోటార్లు ఉన్నాయి. అలాగే వ్యవసాయ మోటార్లు ఉన్నాయి. పదిహేను రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్‌శాఖ అధికారులు తీసుకెళ్లారు. అప్పట్నుంచి కొత్తది ఏర్పాటు చేయకపోవడంతో తాగు, సాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. మరోవైపు లోడ్ ఎక్కువై తరచూ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురవుతోందని, హెవీలోడ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఈ సారైనా హెవీలోడ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.